andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.3, కనిష్ఠం 17.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 14 జనవరి 2025

తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు

ఖానాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ప్రాంత ప్రజల సౌకర్యార్థం తపాలా కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్మల్ సబ్ డివిజన్ తపాలా అధికారి సందీప్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా తపాలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రం ద్వారా ఆధార్‌కార్డులో మొబైల్ నెంబర్, అడ్రస్ సవరణ, ఫింగర్ ప్రింట్ అప్డేట్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రజల భవిష్యత్తు ప్రయోజనాల కోసం తపాలాశాఖ పొదుపు పథకాలు తపాలా బీమా, రికార్డింగ్ డిపాజిట్, వృద్ధులకు సీనియర్ సిటిజన్ పథకం, మహిళలకు ప్రత్యేకంగా మహిళా సంయోజన పథకం, ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి పథకం లాంటి ఎన్నో పథకాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. తపాలా శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



చేప పచ్చళ్ల విక్రయాల కోసం స్టాల్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

కుటీర పరిశ్రమతో ఉపాధి

నిర్మల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు ఇప్పటికే వ్యాపారరంగంలో రాణిస్తూ ఆర్థికంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలోనే వారు మరో కీలకదిశ వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే కుటీర పరిశ్రమ యూనిట్‌లను ఏర్పాటు చేస్తూ ఉపాధిని పొంది.. మరింత ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీని కోసం గానూ పలు ప్రయోగాత్మక కార్యాచరణలకు రూపకల్పన చేశారు. మహిళల సామాజిక వర్గాల ఆధారంగా వారి కుల వృత్తులను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని కడెం, గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టులతో పాటు దాదాపు 500లకు పైగా చెరువులలో కొనసాగుతున్న చేపల పెంపకం ఉపాధిపరంగా ఇప్పటి వరకు మత్స్యకార కుటుంబాల్లోని మగవారికే పరితమైంది. అయితే మత్స్యకార కుటుంబాల్లోని మహిళా సంఘాల సభ్యులు ఈ సాంప్రదాయాన్ని పక్కనపెట్టి చేపలనే ఉపాధిబాటగా మలుచుకునేందుకు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే మత్స్యకార కుటుంబాలకు చెందిన పొదుపు సంఘాల మహిళలకు గత కొద్ది నెలల క్రితం నుంచి చేప పచ్చళ్ల తయారీని ఉపాధిగా ఎంచుకున్నారు. ఈ మహిళా సంఘాల సభ్యులకు డీఆర్‌డీఏ, ఐకేపీ అధికారులు శిక్షణలతో పాటు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ తోడ్పాటుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మత్స్యకార కుటుంబాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు వంద మందికి పైగా ఈ పచ్చళ్ల తయారీలో బిజీగా మారిపోయారు.

- జిల్లాలో పలు రకాల యూనిట్‌ల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రయోగాత్మకంగా చేప పచ్చళ్ల తయారీ కేంద్రాలు
- పైలెట్ ప్రాజెక్టుగా కడెం మండలం ఎంపిక
- బ్రాండెడ్ ప్యాకింగ్‌తో మార్కెట్‌లో విక్రయాలు

కొద్ది రోజుల క్రితం చేపల పచ్చళ్ల తయారీలో ఆసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులందరికీ నిర్మల్‌లో కొద్ది రోజులపాటు శిక్షణను అందించారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదా బాద్‌కు చెందిన ఈడీఐఐ అనే ఓ స్వచ్ఛంద సంస్థ వీరికి ఈ శిక్షణతో పాటు అవసరమైన వంట మెళకువలను నేర్పింది. ప్రస్తుతం వీరు తయారు చేస్తున్న పచ్చళ్లు మార్కెటింగ్ కోసం బ్రాండెడ్ ప్యాకింగ్‌తో విక్రయిస్తున్నారు. కాగా మత్స్యకార కుటుంబాలకు చెందిన ఈ మహిళలంతా తమ భర్తలు చేపల వేట ద్వారా తీసుకొచ్చే చేపలనే కాకుండా డిమాండ్ మేరకు బహిరంగ మార్కెట్‌లో కూడా చేపలను కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ చేపల పచ్చళ్ల తయారీ ఎక్కడో యూనిట్‌లలో కాకుండా ఐదారుగురు చొప్పున ఒక గ్రూపుగా ఏర్పడి తమ ఇళ్లల్లోనే వీటిని తయారు చేస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ఇలా తయారు చేసిన పచ్చళ్లను గ్రామ సమైక్య సంఘాల ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇటీవల కలెక్టరేట్‌తో పాటు వివిధ కార్యాలయాలు, అలాగే కొన్ని మండల కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లలో కూడా చేప పచ్చళ్ల అమ్మకాలను చేపట్టారు. కాగా రెండు రోజుల క్రితం నిర్మల్‌లో నిర్వహించిన నిర్మల్ ఉత్సవాల్లో భాగంగా ఈ మత్స్య కార కుటుంబాల మహిళా పొదుపు సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో చేపల పచ్చళ్లను విక్రయించారు. నాలుగు రోజులపాటు ఇక్కడి చేపపచ్చళ్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది. అలాగే చాలా మంది నుమాయిష్‌ను సందర్శించిన వారే కాకుండా మంత్రి సీతక్కతో పాటు ఇతర ప్రముఖులు సైతం చేప పచ్చళ్ల రుచులను చూసి అభినందించారు.


చేపల పచ్చడి
ప్యాకింగ్ చేసిన పచ్చళ్లు

ప్రయోగాత్మకంగా కడెం ప్రాంతం ఎంపిక

మత్స్యకార కుటుంబాలకు చెందిన మహిళల చేత చేప పచ్చళ్ల తయారీకి సంబంధించి కడెం ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. కడెం ప్రాజెక్టులో వేసవి చివరి సమయంలో చేపలు తక్కువగా ఉండడంతో మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కరువవుతున్నట్లు గుర్తించారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లోని అందుబాటులో ఉన్న చేపలతో పాటు చుట్టుపక్కల చెరువులు తదితర చోట్ల లభించే చేపలతో ఈ పచ్చళ్లను తయారు చేసి ఆ కుటుంబాలు ఉపాధి పొందే విధంగా ఈ పైలెట్ ప్రాజెక్టును రూపొందించారు. అలాగే వర్షాకాలం, శీతాకాలంలో ప్రాజెక్టులోనే చేపలు పుష్కలంగా లభించే అవకాశం ఉండడంతో ఇక్కడి చేపలనే పచ్చళ్ల తయారీకి ఉపయోగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలోని మహిళా సంఘాలకు చెందిన దాదాపు 100 మంది మహిళలకు నిర్మల్‌కు చెందిన ఈడీఐఐ అనే ఓ స్వచ్ఛంద సంస్థ చేప పచ్చళ్ల తయారీతో పాటు ప్యాకింగ్, మార్కెటింగ్ అంశాలపై కూడా శిక్షణ అందించింది. పచ్చళ్లతో పాటు బర్గర్, పిజ్జా లాంటి ఫాస్ట్ ఫుడ్ తయారీపై కూడా వీరికి శిక్షణ ఇచ్చారు. ఈ స్వచ్ఛంద సంస్థ పచ్చళ్లు తయారు చేసే మహిళలకు ప్యాకింగ్ మిషన్లను కూడా అందించింది. అలాగే డీఆర్డీఏ, ఐకేపీ అధి కారులు బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేయించారు. ఐదారుగురు మహిళా సభ్యులతో కూడిన ఒక్కో గ్రూపుకు లక్ష రూపాయల చొప్పున ఇప్పటికే బ్యాంకులు రుణాలను మంజూరు చేశాయి. కాగా దశల వారీగా గడ్డె న్నవాగు, స్వర్ణప్రాజెక్టు పరిధిలో కూడా అక్కడి మత్స్యకార కుటుంబాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులతో చేప పచ్చళ్లతో పాటు ఇతర వంటకాల తయారీని కూడా చేప ట్టేందుకు నిర్ణయించారు.

మండల కేంద్రాల్లో చేపల ఔట్‌లెట్ల ఏర్పాటు

మత్స్య సంపదను ప్రోత్సహిస్తూనే మహిళలకు స్వయం ఉపాధిని పెంపొందించేందు కోసం కొద్దిరోజుల్లోనే జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణంలోను అలాగే అన్ని మండల కేంద్రాలలోను షిష్‌ఫుడ్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికోసం గాను ఆయా మండల కేంద్రాల్లోని మత్స్యకార కుటుంబాలకు చెందిన పొదుపు సంఘాల మహిళా సభ్యులకు శిక్షణతో పాటు ఆర్థిక సహకారం అందించనున్నారు. గ్రామ సమైక్య సంఘాల ఆధ్వర్యంలో అవుట్ లెట్లను ఏర్పాటు చేయనున్నారు. చేప పచ్చళ్లతో పాటు చేపతో తయారు చేసే అన్ని రకాల వంటకాలను ఈ అవుట్ లెట్లలో విక్రయించాలని భావిస్తున్నారు.

ఇటుకల తయారీలో కలప వినియోగిస్తే చర్యలు

- ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ బాసర ఎఫ్‌ఆర్‌వో సీహెచ్ అనిత


ఇటుక బట్టీలలో తనిఖీలు చేపడుతున్న అటవీశాఖాధికారులు, సిబ్బంది

భైంసా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఇటుకల తయారీ ప్రక్రియలో కలపను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ బాసర ఎఫ్‌ఆర్‌వో సీహెచ్ అనిత వెల్లడించారు. సోమవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గల ఇటుక బట్టీల్లో భైంసా ఫారెస్టు రేంజ్ అధికారి వేణుగోపాల్, సిబ్బంది, బాసర ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో 18 బట్టీల్లో తనిఖీలు చేపట్టగా 11 బట్టీలల్లో నిబంధనలను కాలరాస్తూ తయారీదారులు కలపను వినియోగిస్తున్నట్లుగా గుర్తించి సంబంధిత ఇటుక బట్టీ నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లుగా పేర్కొన్నారు. ఇటుకల తయారీదారులు అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన, అతిక్రమించిన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందులో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఇర్ఫానోద్దీన్, సెక్షన్ ఆఫీసర్ అర్షద్ రాజా, బీటీ ఆఫీసర్ ఆలీమ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

నర్సాపూర్(జి), జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అరవింద పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు కల్పన భూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఒక ప్రకటనలో ముగ్గుల పోటీలకు స్వర్ణ సిద్ధమైనట్లు కట్కం దత్తాత్రేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు మహిళలంతా హాజరుకావాలని కోరారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

ముథోల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : హత్యకేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ముథోల్ సీఐ మల్లేష్ తెలిపారు. మండల కేంద్రమైన ముథోల్‌లో కోలిగల్లీకి చెందిన కరుణ్ శనివారం హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతుడి తండ్రి రాందాస్ (ఏఎస్సై)ను, మృతుడి బావ అనిల్ (కానిస్టేబుల్)ను పోలీసులు అదుపులోకి తీసుకొని హత్య కేసు నమోదు చేశారు. కేసులో భాగంగా అదుపులో ఉన్న రాందాస్, అనిల్‌లను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ముథోల్ సీఐ మల్లేష్ తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



లక్ష్మణచాంద, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని సంక్రాంతి పండగ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీ సోమవారం అన్నారు. మండలంలోని చింతల్‌చందా గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ), (టీయూసీఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కబడ్డీ, మ్యూజికల్ చైర్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి, రెండవ బహుమతి గెలుచుకున్న వారికి (పీవోడబ్ల్యూ) బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆటలు శారీరకంగానే కాకుండా మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని, శరీర దృఢత్వాన్ని కలిగిస్తాయన్నారు. ఈరోజు మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. మహిళలు పురుషులతో పాటు చదువుల్లో అన్ని రంగాల్లో పోటీ పడుతూ రాణిస్తున్నారని అయినా నేటికీ మహిళల పట్ల వివక్ష చూపటం, హత్యలు అత్యాచారాలు జరగడం బాధాకరమని, వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సునంద, అర్చన, సంధ్యా, గౌతమి, విమల, కవిత, తదితర మహిళలు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత


పెద్దూర్ తండా యువకులకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న కొప్పుల నరేష్

ఖానాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలం పెద్దూర్ తండా గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు సోమవారం ఆదివారం జిల్లా టీఆర్‌ఎస్‌వీ మాజీ అధ్యక్షులు కొప్పుల నరేష్ ఉచితంగా వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి కోల నరేష్, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా గోదారంగనాథుల కల్యాణం


ఆలయ ఆవరణలో గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం


కల్యాణ అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న గోదాదేవి రంగనాథ స్వామి

ఖానాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాథ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి గోదాదేవి రంగనాథ స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు చక్రపాణి వాసుదేవచార్యులు, చక్రపాణి నరసింహమూర్తిల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేద పండితుల సమక్షంలో కన్నుల పండుగగా సాగిన గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానాన్ని నిర్వహించారు.

కమనీయం గోదారంగనాథుల కల్యాణం

మామడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్కల్ గ్రామంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వర ఆలయంలో గోదా రంగనాథుల కళ్యాణం అంగరంగ వైభవంగా సోమవారం నిర్వహించారు. అర్చకులు రామచంద్ర శర్మ, విజయసారథి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. 30 రోజులపాటు జరిగిన ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. పోతారం, అనంతపేట్, పొన్కల్ గ్రామాల ప్రజలందరూ ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

విఠలేశ్వరాలయంలో పౌర్ణిమ దర్శనం

కుభీర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో సోమవారం పౌర్ణిమ దర్శన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరిహోం భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనరంబాపు శిష్యుడు రెడ్డిమహారాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులనుద్దేశించి మాట్లాడారు. చెడువ్యసనాలకు బానిస కాకుండా ప్రతీ ఒక్కరు భక్తి మార్గంలో ప్రయాణించి సాటి మనుషులకు సహాయం చేయాలని సూచించారు. అనంతరం అన్న వితరణ చేపట్టారు.


గోదా రంగనాథుల కల్యాణానికి హాజరైన భక్తులు


పొన్కల్‌లో గోదా రంగనాథుల కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పర్వదిన వేడుకల్లో సంస్కృతి,సంప్రదాయాలు ప్రతిబింభించాలి

- ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పాటిల్

భైంసా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకునే పర్వదిన వేడుకల్లో సంస్కృతి, సంప్రదాయాలు పరిఢవిల్లాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాశ్చాత్యధోరణి విధానాలు, ఆదునికత పేరిట అంతరించి పోతున్న సనాతనమైన సంస్కృతి, సంప్రదాయాలు,అచార వ్యవహరాలకు పూర్వవైభవం తీసుక వచ్చే దిశగా మహిళా లోకం చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పర్వదిన వేడుకలను అచార వ్యవహరాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఇందులో ఎలాంటి అధునిక విధానాలకు తావులేకుండా జరుపుకోవాలన్నారు. అర్‌ఎస్‌ఎస్ సహ సంఘచాలక్ సాధుల కృష్ణదాస్ మాట్లాడుతూ మతోన్మాదుల దుశ్చర్యలు, అకృత్యాల బారిన పడకుండా ఉండేందుకు మహిళలు, యువతులు జాగ్రతం కావాలని అకాంక్షించారు. ధర్మ పరిరక్షణకు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్ మాట్లాడుతూ సనాతనమైన ధర్మానికి అనుగుణంగా హిందువులు నడుచుకోవాలన్నారు. పర్వదిన ఉత్సవాల్లో అధునికతకు చోటు లేకుండా నిర్వహించుకోవాలన్నారు. ధర్మానికి విరుద్దంగా నిర్వహించబడే విధానాలపై మేల్కొని సనాతనమైన సంస్కృతి, సంప్రదాయలకు అనుగుణంగా వ్యవహరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన డి. లక్ష్మీ, భాగ్యశ్రీ, అభినందనలకు బహుమతులను అందచేశారు. పోటీలో పాల్గొన్న వారందరికి ప్రోత్సహక బహుమతిగా భగవద్గీత పుస్తకాలను అందించారు. ఇందులో భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.దామోదర్ రెడ్డి, పండితులు బబ్బు మహారాజ్, బీఆర్ఎస్ ప్రతినిధి విలాస్ గాదేవార్, బీజేపీ ప్రతినిధి ఎనుపోతుల మల్లేశ్వర్, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు డా.నగేష్, పురస్తు గోపాల్, నందు భయ్యాలతో పాటు పలువురు పాల్గొన్నారు.


విజేతలతో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ తదితరులు

సమాజానికి ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులు

- ఎస్‌టీయూ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులు అని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో స్టేట్ టీచర్స్ యూనియన్ క్యాలెండర్లను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నేటి బాలురే రేపటి నవభారత జాతి నిర్మాతలు అని అన్నారు. వీరిని తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. అనంతరం ఎన్నో సంవత్సరాల నుంచి నిర్మల్ జిల్లా ప్రజల చిరకాల కోరికైన రైల్వే లైన్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను ఎస్‌టీయూ జిల్లా కమిటీ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. భూమన్న యాదవ్, జే. లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు జుట్టు గజేందర్, గంగాధర్, ఇర్ఫాన్ షేక్, ఎం. శ్రీనివాస్, బి. వెంకటేశ్వర్ రావు, లక్ష్మీనారాయణ, ఖలీద్ అహ్మద్, దిగంబర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు వేయాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్

ఖానాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ పట్ల అహంకారంతో ప్రవర్తించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మావతినగర్ కాలనీలో ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా అహంకారంతో వ్యవహరిస్తూ తోటీ ప్రజా ప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న కౌశిక్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకుడైన సత్తు మల్లేష్ పట్ల అనుచితంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పార్టీకి బీసీల పట్ల ఏమాత్రం గౌరవం ఉన్న బీసీ నాయకుడైన సత్తు మల్లేష్‌ను అవమానించేలా అమర్యాదకరంగా ప్రవర్తించిన కౌశిక్‌రెడ్డిని వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో కచ్చితంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోటసత్యం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
నిర్మల్ - 99854 03060
భైంసా - 81258 56776
అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్ : 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451


అఖండ హరినామ యజ్ఞానానికి హాజరైన భక్తులు, గ్రామస్థులు

ఘనంగా అఖండ హరినామ మహా యజ్ఞం

● హాజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు

తలమడుగు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్సి తండా గ్రామంలో గల సంత్ శ్రీనారాయణ బాబా ఆశ్రమంలో నిర్వహించిన 29వ వార్షికోత్సవ అఖండ హరినామ మహా యజ్ఞోత్సవానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు హాజరయ్యారు. ఎమ్మెల్యే నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పుష్య పున్నమి చాలా శుభదినమని, ప్రతీయేటా నారాయణ బాబా ఆశ్రమానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున వస్తారన్నారు. నారాయణ బాబా ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాబు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జాదవ్ కిషన్, మండల కన్వీనర్ తోట పిడుగు అభిరామ్ రెడ్డి, కేదారేశవరెడ్డి, మేకల రవికాంత్ యాదవ్, రంజిత్ రెడ్డి, మాజీ సర్పంచుల అంగూరు పోచన్న, రమాకాంత్, సుదర్శన్ రెడ్డి, గంగాధర్, ప్రకాష్ రెడ్డి, ప్రమోద్, తోట చందు, తోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● పలు అభివృద్ధి పనుల పరిశీలన

నేరడిగొండ: మండలంలోని రాజురా గ్రామానికి వెళ్లే రహదారి పనులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణం పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పుష్య పౌర్ణమి సందర్భంగా రాజురా గ్రామంలోగల జగదాంబదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సక్రియా నాయక్ తండాలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ఉట్నూర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నీలాగొంది, చందూరి గోండు గూడా, కామాయిపేట్, లింగోజి తండా ఎక్స్ రోడ్డు గ్రామాల్లో జాతీయ ఆరోగ్య మిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజన గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కల్పించారు. ఆరోగ్యం రోడ్డు భద్రత మన వ్యవసాయం డ్రగ్స్ నిర్మూలనపై కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో టీం సభ్యులు గోవింద్ రావు, రాథోడ్ శంకర్, గోడం ఆశిష్, కుమ్ర నగేష్, ఆశ కార్యకర్త, గ్రామస్థులు, తదతరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఆడె

తలమడుగు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని పల్సి(బీ) తండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వాటిని అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పల్సి(బి) తండాలో నిర్వహించిన నారాయణ బాబా అఖండ మహా యజ్ఞం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకట్ యాదవ్, ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాజీరావ్ మహరాజ్ విగ్రహాల ఏర్పాటుకు కృషి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ● పిప్పల్‌ధరిలో బాజీరావ్ సప్తాహ ముగింపు వేడుకలు ● పాల్గొన్న భక్తులు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్


రిమ్స్ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతూ..

ఆదిలాబాద్ రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బాజీరావ్ మహరాజ్ విగ్రహాల ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో ఏడు రోజులుగా కొనసాగుతున్న బాజీరావ్ సప్తాహ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా బాజీరావ్ చిత్ర పటం వద్ద పూజలు చేశారు. అనంతరం భజనలో డోలు వాయించి భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ బాజీరావ్‌బాబా భక్తులు ఏ విధంగానైతే చెడు అలవాట్లకు దూరంగా ఉంటారో మరింత మందిని కూడా అదే దారిలో తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. మహారాష్ట్రకు జిల్లా ఆనుకొని ఉండడంతో గ్రామగ్రామన బాజీరావ్ సప్తాహలు కొనసాగుతున్నాయన్నారు. అయితే ఎండ్లుగా బాజీరావ్ బాబా విగ్రహాలు లేకపోవడంతో తాను కూడా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించడం జరిగిందన్నారు. దీనికి గాను ఓ కమిటీ వేసి చర్చించిన తర్వాత ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దయాకర్, మయూర్ చంద్ర, నిల్, లింగన్న, నారాయణ, బాజీరావ్ బాబా భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

● రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తనిఖీ

ఆదిలాబాద్ రూరల్: వెనకబడిన ఆదిలాబాద్ జిల్లా ప్రజలతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రజలకు సౌకర్యవర్ధంగా ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ.150 కోట్లతో రిమ్స్ సూపర్ స్పెషలిటీని నిర్మించారని, దీని నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం రిమ్స్ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించి పలు వార్డుల్లో రోగులను పరామర్శించారు. ముందుగా ఓపీ కౌంటర్‌తోపాటు ఫార్మాసిని పరిశీలించి రోగుల వివరాలు, మందుల నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పైకప్పు లీకేజీ కారణంగా పడిపోవడంతో దాన్ని చూసి మరమ్మతులు చేయించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సూచించారు. అదేవిధంగా మరుగుదొడ్లను పరిశీలించి నీరు బయటకు రావడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు మందులను నిల్వ ఉంచుకోవాలన్నారు. వైద్యుల పోస్టుల భర్తీకి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దయాకర్, మయూర్ చంద్ర, నిల్, లింగన్న, నారాయణ పాల్గొన్నారు.

● ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సహకారం

ఆదిలాబాద్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరం కోసం తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో తెలంగాణ గజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌తోపాటు డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేకు పలు సమస్యల గురించి తెలియజేశారు. సంఘ భవనంతోపాటు పెండింగ్ డీఏ, రిటైర్‌మెంట్ వెన్‌ఫిట్స్ త్వరగా అందించేల చూడాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే పాయల శంకర్ సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ సింగ్ తిలవాత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం శశికల, కమిటీ సభ్యులు నర్సయ్య, రాజశేఖర్, నీల, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.


మండల సరిహద్దులోని గుట్టపై భక్తుల కోలాహలం

కైలాస్ టేకిడికి పోటెత్తిన భక్తజనం

బోథ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దుల్లోని మహారాష్ట్ర శివారులో ఎత్తైన గుట్టలపై ఉన్న కైలాస్ టేకిడి ఆలయాన్ని సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండపై భక్తుల కోలాహలం కనిపించింది. అంతేకాకుండా గుట్టపై మహరాజ్ ఆధ్వర్యంలో శివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు.

బాబా ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

బోథ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్ ఫులాజి బాబా ధ్యాన కేంద్ర వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ గ్రామాల నుండి భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భగవంతురావు మాట్లాడుతూ ఫులాజి బాబా చూపించిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఇందులో అధ్యక్షుడు అర్క లక్ష్మణ్, ఆడం పుల్లన్న, కొండిబా మడావి, లాలూ దేవ్, ఉపాధ్యాయులు పందరం శంకర్, యాదవరావు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె మృతి

బోథ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నూరు గ్రామంలో సోమవారం ఉదయం గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. దాడిలో గ్రామానికి చెందిన పెద్ద మహినుద్దీన్ అనే వ్యక్తికి చెందిన గొర్రె మృతి చెందింది. దీంతో గొర్రెల యజమానికి రూ.10వేల మేర నష్టం వాటిల్లింది. సంబంధించింది. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, గ్రామ పంచాయతీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు వాపోయాడు. తనకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం అందించాలని కోరారు.

బయో మాఫియా..!

(5వ పేజీ తరువాయి...)

పండిస్తున్న రైతులకు నకిలీ పురుగు మందుల బెడదతో చివరకు నష్టాలే మిగులుతున్నాయి. నకిలీ మందులను అరికట్టేందుకు యేటా ప్రభుత్వం ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా.. జిల్లాలో మాత్రం నకిలీ మందులకు అడ్డుకట్ట పడడం లేదు. నిరంతరం తనిఖీలు చేపట్టి బాధ్యులైన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమొదు చేయాలని పలువురు రైతులు డిమాండ్ చెస్తున్నారు.


మంత్రి సీతకను కలసిన గజానంద్ నాయక్

మండల అభివృద్ధికి సహకరించండి

● సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నార్నూర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నార్నూర్ మండలం అభివృద్ధికి చాలా దూరంలో ఉందని, అభివృద్ధికి సహకరించాలని మంత్రి సీతక్కని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్ నాయక్ కోరారు. సోమవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా ఆదివాసీల ఆరాధ్య దైవమైన జంగుబాయి దర్శనానికి వెళ్తున్న మంత్రి సీతక్కను ఉమ్రి గ్రామం వద్ద కలిసి ఈ ప్రాంత సమస్యలను విన్నవించారు. ఉమ్మడి నార్నూర్ మండలంలో రోడ్డు రవాణా చాలా ఇబ్బంది ఉన్నది ముఖ్యంగా హస్నాపూర్ నుంచి మేడిగూడ గ్రామం, చుట్టుపక్కల లింక్ గ్రామాలకు రోడ్డు సరిగ్గా లేనందున ప్రాంత వాసులకు చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. అత్యవసరమైన సమయంలో వైద్య పరంగా రోగులకు వైద్యం చాలా కష్టమవుతోందని పేర్కొన్నారు. చిన్నారులకు విద్య అందాలంటే అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేయాలన్నారు. రైతులకు సాగునీరు అందించేలా ఎంపల్లి ప్రాజెక్టును మంజూరు చేయాలన్నారు నార్నూర్ గాదిగూడ వైద్య ఆసుపత్రిలో పూర్తిగా సిబ్బందులను నియమించాలన్నారు. సమస్యలపైన మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారి వెంట ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, దేవరావు, లోకండే వసంత్, ఆడె ప్రకాష్, చౌవాన్ రుపుదేవ, కాంతరావు, దుర్గే బ్రిజ్‌లాల్, తదితరులున్నారు.

కొలాం గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ఉట్నూర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల రాజుగూడ గ్రామంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీ బాయి సోమవారం కొలాం గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 20 నిరుపేద కుటుంబాలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయి మాట్లాడుతూ చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున నిరుపేద గిరిజనులకు దుప్పట్లు అందించినట్లు తెలిపారు. ఇందులో కాంబ్లే అతీష్, ఆత్రం మోతిరామ్, మడావి రవి, తదితరులు పాల్గొన్నారు.


కొలాం గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఈశ్వరీ బాయి

ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు


ముగ్గులు వేస్తున్న చిన్నారి.. సకినాలు పోస్తున్న మహిళ

ముథోల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం భోగి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులను వేసి సంక్రాంతి శుభాకాంక్షలు రాశారు. పిల్లలు, పెద్దలు గాలి పటాలను ఎగురవేశారు. చిన్న పిల్లలకు పెద్దలు భోగి పండ్లను పోసి ఆశీర్వదించారు. ప్రతి ఇంటిలో పిండి వంటలు సంక్రాంతికి ప్రత్యేకంగా సకినాలు చేయడంలో మహిళలు బిజీ అయ్యారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి పండుగ


భోగి మంటలు వేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నిర్మల్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో భోగి మండలను వెలిగించారు. కష్ట నష్టాలు, సాధక బాధకాలన్నీ భోగి మంటల్లో కాలిపోయి అంతా శుభమే జరగాలని కోరుకుంటూ ఒకరికొకరు భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

17న జగద్గురు

నరేంద్రాచార్యాజీ మహరాజ్ పాదుక దర్శనం

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం లోని ప్రేమ లాగార్డెన్ సమీపంలో ఈనెల17న నిర్వహించే జగద్గురు నరేంద్రచార్యాజీ మహరాజ్‌పాదుక దర్శనాన్ని విజయ వంతం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు చెందన్‌కాడే బాలాజీ, జిల్లా నిరక్ష్ దీలిప్ గాయక్వాడ్, ధర్మక్షేత్ర ప్రముఖులు పందరి చాప్లే కోరారు. పాదుకా దర్శనంతో పాటు ఉపాక్ దీక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు వారు పెర్కొన్నారు. కార్యక్రమం అనంతరం అరుగురు నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

సిర్పూర్(యు)లో 12.4డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏజెన్సీ మండలాలు చలికి వణికి పోతున్నాయి. సోమవారం సిర్పూర్(యు) మండలంలో అత్యల్పంగా 12.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తిర్యాణి మండలం గిన్నెధరిలో 12.7, తిర్యాణిలో 13.1, కెరమెరిలో 14.1, కెరమెరి మండలం ధనోరలో 14.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఏజెన్సీ గ్రామాల ప్రజలు చలిమంటలు కాగుతున్నారు.

నేట్నూర్‌లో ముగిసిన కబడ్డీ టోర్నమెంట్

సిర్పూర్(యు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేట్నూర్‌లో జైఆదివాసీ యూత్, గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. రెండు రోజులుగా జరిగిన కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి జట్టులు పాల్గొన్నాయి.

రోడ్డు భద్రత నియమావళి పాటిస్తే ప్రమాదాలు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న భైంసా టౌన్ ఎస్ఐ మహ్మద్ గౌస్


రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భైంసా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమావళిని పాటిస్తే ప్రమాదాలు నివారించబడి జీవితాలకు రక్షణ చేకూరుతుందని భైంసా టౌన్ ఎస్ఐ మహ్మద్ గౌస్ పేర్కొన్నారు. భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ కాటన్ యార్డులో ప్రైవేట్ వాహన చోదకులతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అజాగ్రతగా వాహనాలను నడుపడం, రోడ్డు భద్రతా నియమావళిని విస్మరించడం మూలంగానే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. కొన్ని సందర్భాలలో వాహన కండీషనత్ పాటు మరికొన్ని ఇతర కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పాదచారులు సైతం ట్రాఫిక్ నియమావళికి అనుగుణంగానే నడుచుకోవాలని సూచించారు. చోదకులు వాహనాలను నడిసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, పక్క వారితో మాట్లాడుతూ వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. మూల మలుపుల వద్ద , ముందరి వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తగా వాహనాన్ని నడుపాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ , నాలుగు చక్రాల వాహన చోదకులు సీట్ బెల్ట్ విధిగా ధరించాలని పేర్కొన్నారు. ఇందులో భైంసా టౌన్ ఏఎస్ఐ దేవరావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కుంటాలలో..

కుంటాల, జనవరి, 13 : (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఏఎస్సై జీవన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని లింబా (కె) గ్రామంలో ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలని, అంతేగాకుండా మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని రకాల వాహన పత్రాలను ఎల్లప్పుడు సక్రమంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరు ఇంటి నుండి బయటకు వెళ్లిన సమయంలో రహదారిపై నిబంధనలకు అనుగుణంగా మెసులుకుంటే మనతో పాటు మన ఎదుటి వారికి కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాదిక్ , తదితరులు ఉన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయి


విజేతలకు బహుమతులను ప్రధానం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్

భైంసా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని, ప్రతీ ఒకరు ఆరోగ్యవంతమైన జీవితం కోసం క్రీడలు, వ్యాయమం తమ తమ జీవితాల్లో భాగంగా చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం భైంసాలోని గ్రీన్ ఫీల్డ్ మిని స్టేడియమ్‌లో ముగిసిన డివిజన్ ఫోటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతల బహుమతి పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్రీడల ద్వారా మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం చేకూరుతుందన్నారు. ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తితో తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఓటమి చెందిన జట్టు నిరాశ చెందకుండా రానున్న పోటీల్లో విజేతగా నిలిచేందుకు శ్రమించాలని సూచించారు. ఈ సందర్భంగా విజేతలకు జిల్లా ఫోటోగ్రఫీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు ప్రవీణ్, రమేష్ పాటిల్, రావుల పోశెట్టి, డివిజన్ అధ్యక్షులు మణికంఠలతో కలిసి బహుమతులను అందచేశారు. ఇందులో డివిజన్ ఫోటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ ప్రతినిధులు దత్త ప్రసాద్ (పండిత్), అల్లూర్ దత్తు, వరగంటి విఠల్‌లతో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల ఫోటో,వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కుంటాల, జనవరి, 13 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింబా (కే) గ్రామంలో సోమవారం క్రికెట్ పోటీలను ఆత్మ చైర్మన్ అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ రావు పటేల్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన సత్యం భూమన్న స్మారకార్థం ఆయన కుమారుడు సత్యం గిరీష్ ఆధ్వర్యంలో 18వ ఎల్‌పీఎల్ క్రికెట్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దత్తురాం పటేల్, వీడీసీ చైర్మన్ ముత్యం రెడ్డి, సభ్యులు గోనె గజ్జారాం, గౌతమ్, ప్రమోద్, రాజు, అజయ్, ఎల్‌పీఎల్ చైర్మన్ మల్లా రెడ్డి, వైస్ చైర్మన్ చిన్నోల్ల అశోక్ రెడ్డి, సభ్యులు దత్తు, ఆకాష్, అనిల్, సుంకరి మహేందర్, భాస్కర్ రెడ్డి, గణేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.


లింబా (కే) గ్రామంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆత్మ చైర్మన్ అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ రావు పటేల్

ఆరే మరాఠా ఎంప్లాయిస్ వెల్ఫేర్

అసోసియేషన్ సేవలు అభినందనీయం

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్


క్యాలెండర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ తదితరులు

భైంసా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ఉద్యోగార్థుల అభ్యున్నతికి, సంఘ సభ్యుల సంక్షేమానికి ఆరే మరాఠా ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమేవా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కణను చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అసోసియేషన్ సభ్యులు సమాజాభివృద్ధికి బాధ్యతాయుతమైన భాగస్వామ్యాన్ని అందిస్తూ ఆదర్శంగా వ్యవహరిస్తున్నారని కితాబునిచ్చారు. కుల విద్యార్థులు, ఉద్యోగార్థులకు అవసరమైన సహాయ, సహకారాలు, ప్రోత్సాహన్ని అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. సమాజ సేవ కార్యక్రమాలను మరింత విస్తృత పరచాలని సూచించారు. ఇందులో ఆమేవా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిందే హనుమంతరావ్ పాటిల్, బోస్లే గంగాధర్, గౌరవ అధ్యక్షులు నర్వాడే వసంత్‌రావ్ పాటిల్, కోశాధికారి బాలాజీ పాటిల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా వాసికి తెలంగాణ సాహిత్య సదస్సు పురస్కారం


వెంకట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముథోల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ప్రధాన నగరానికి చెందిన ప్రముఖ పద్యకవి, సంస్కృత భాష ప్రచార సమితి, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షుడు బి. వెంకట్ కామారెడ్డి జిల్లా చారిత్రక క్షేత్రం దోమకొండకోట సంస్థానంలో దోమకొండ ఫోర్ట్ అండ్ విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 12వ తేదీ రాత్రి 11 గంటల వరకు జరిగిన సాహిత్య సదస్సులో దోమకొండ వంశస్తులు, కోట యజమాని, అనిల్ కామినేని, దోమకొండ కోట మేనేజర్, సదస్సు నిర్వాహకులు బాబ్జిజ్వాలాది, ప్రముఖ కవుల చేతుల మీదుగా తెలంగాణ సాహిత్య సమాలోచన సదస్సు పురస్కార సన్మానాన్ని అందుకున్నారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండి నిత్యానందరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకట్ ఉరెడ్డి, ఆచార్య సంగనభట్ల నర్సయ్య, తెలంగాణ విశ్వవిద్యాలయం కళలు పీఠాధిపతి ఆచార్య కరిమిండ్ల లావణ్య, పద్మభూషణ్, డా. కేతు. వరప్రసాద్‌రెడ్డిలు వెంకట్ చేసిన దోమకొండ చరిత్ర ఉపన్యాసమునకు, స్వీయపద్మ పఠనమునకు అభినందించారు. తెలంగాణ సాహిత్యసేవ, భాష, వ్యాకరణం, అలంకారాలు, చందస్సు, ప్రబంధాలు, గ్రామీణ సంస్కృతి, కావ్యాలు, గేయాలు, పొడుపు కథలు, సామెతలు, ఇతిహాసం, పౌరాణిక కథలు, తదితర సాహిత్య పరమైన చర్చల్లో వెంకట్ పాల్గొన్నారు. మల్లినాథసూరి కళాపీఠం ఏడుపాయల సంస్థాన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు పబ్బ విజయశ్రీ, ముల్కా స్రవంతి, శర్వాణి పాతూరి, వడ్ల వెంకటేష్‌లతో పాటు 18 మంది ప్రముఖ కవులు కవితాగానం చేసినట్లు వెంకట్ తెలిపారు.

నేడే సంక్రాంతి

- మార్కెట్లు రద్దీ
- రంగు రంగుల ముగ్గులతో నిండనున్న వాకిళ్లు
- పతంగుల కొనుగోలులో యువకులు, చిన్నారులు బిజీ..బిజీ..


పండుగ సామాగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు


గాలిపటాలు కొనుగోలు చేస్తున్న చిన్నారులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వేడుకలకు వేళయింది. సోమవారం ప్రారంభమైన సంబరాలు మూడురోజుల పాటు నిర్వహించుకోనున్నారు. ఇంటిముంగిట కొత్త శోభను సంతరించే విధంగా రంగురంగులతో ముగ్గులు వేసేందుకు మహిళలు సిద్ధమయ్యారు. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండగలను నిర్వహించుకోనున్నారు. పండగను పురస్కరించుకొని పిండి వంటకాల తయారీలో మహిళలు బిజీగా ఉన్నారు. సంక్రాంతి సెలవులు రావడంతో విద్యార్థులు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు, బంధువులు ఇండ్లకు చేరడంతో ఊళ్లలో పండగ వాతావరణం సంతరించకుంది. రైతన్నలు పండించిన పంటలు ఇండ్లకు చేరడంతో ఆవుపేడ, రగక, పిండి గడ్డితో గౌరమ్మలను తయారు చేసి నవధాన్యాల్లో ఇంటి గుమ్మాలు, వాకిళ్లలో అలంకరించనున్నారు. హరిదాసు కీర్తనలతోపాటు పాటు గంగి రెద్దుల విన్యాసాలు చేయనున్నాయి.

పల్లెల్లో జోష్..

సంక్రాంతి వచ్చిందంటే పల్లె మొదలు నగరాల వరకు కొత్త శోభను సంతరించుకుంటాయి. సంవత్సరం మొత్తం మీద ఎన్ని పండుగలు ఉన్నప్పటికీ, తెలుగువారికి ముఖ్యమైన పండుగల్లో సంక్రాంతి ఒకటి. దూరప్రాంతాల్లో ఉన్న కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు సంక్రాంతికి సొంతూళ్లకు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. వివిధ రకాల ఆటలు, ముగ్గులపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతి ఇంట్లో కొన్ని ప్రత్యేక వంటకాలు సిద్ధమై నోరూరిస్తుంటాయి. బసవన్నల సందడి ఇండ్ల లోగిళ్ల ముందు గొబ్బెమ్మలు, రంగు రంగుల ముగ్గు, డూడూ బసవన్నల సందడులు సంక్రాంతి సంబరాలు ప్రజల్లో చెప్పలేనంత జోష్‌ను తీసుకొస్తాయి.

ప్రత్యేక పండుగ

హిందువులు జరుపుకునే పండుగల్లో సంక్రాంతి ఒకటి. దీనిని చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ సంతోషంగా నిర్వహించుకుంటారు. సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు పట్నాలు, నగరాల నుంచి ప్రజలు గ్రామాలకు చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలతో మూడు రోజులపాటు గ్రామాలు, పట్టణాలు కళకళలాడనున్నాయి. గాలిపటాలు ఎగురవేయడంలో వేయడంలో యువత నిమగ్నమైంది.


మార్కెట్‌లో నెలకొన్న రద్దీ

పట్టణంలోని మార్కెట్లలో రద్దీ...

ఆదిలాబాద్ పట్టణంలో సంక్రాంతి సందడి ఇప్పటికే మొదలైంది. వివిధ రకాల ఆకారాల్లో ఉన్న గాలిపటాలు, రంగుల ప్యాకెట్ల కొనుగోలులో బిజీగా ఉండడంతో షాపులు కిటకిటలాడుతున్నాయి. దీంతో పట్టణంలో పలు కూడళ్లు కిటకిటలాడుతున్నాయి. కొనుగోలు దారులతో పట్టణ మంతా పూర్తిగా రద్దీగా మారింది.

మొదలైన సందడి


పల్లెల్లో గంగిరెద్దుల విన్యాసాలు

తలమడుగు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి సంబరాలు జోరందుకున్నాయి. రైతులు పండించిన పంటలు ఇంటికి చేరుకోవడంతో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేపడుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగ ఉపాధి రీత్యా ఉన్నత చదువుల కోసం పట్టణాలకు వెళ్లిన పల్లెవాసులు సంక్రాంతి పండుగ కోసం పల్లెలకు చేరుకున్నారు. పండుగ సందర్భంగా హరిదాసుల కీర్తనలు. గంగిరెద్దుల విన్యాసాలు ఇంటి ఎదుట ముగ్గుల సందడి నెలకొంటుంది. చిన్నారుల గాలిపటాల కేరింతలతో కాలనీలు సందడిగా మారాయి. మహిళలు తయారు చేస్తున్న రకరకాల పిండి వంటలు ఇంటికి వచ్చిన కొత్త అల్లుళ్లతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. సంబరాలు బంధువుల సంభాషణలతో పల్లెల్లో ఎటుచూసినా సందడి నెలకొంటుంది. అంతేకాకుండా సంక్రాంతి పండుగకు ధానదర్మాల పండుగగా పల్లెవాసులు కొలుస్తూ ఉంటారు. ఆ మేరకు కార్యక్రమాలు పల్లెప్రజలు నిర్వహిస్తారు.


సంక్రాంతి ముగ్గులు వేస్తున్న మహిళ

కమనీయంగా కల్యాణోత్సవం

- శాస్త్రోక్తంగా గోదాదేవి- రంగనాథుల పరిణయం
- తిలకించి పులకించిన అశేష భక్తజనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- మార్మోగిన గోవింద నామస్మరణం
- ముగిసిన ధనుర్మాసవ్రత ఉత్సవాలు


చిన్నారుల నృత్యప్రదర్శన


మాంగల్యధారణ కార్యక్రమాన్ని చేపడుతున్న వేదపండితులు

భైంసా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి):పండితుల వేదమంత్రోచ్చారణలు, ఆశేష భక్త జనవాహిని గోవింద నామస్మరణల మధ్య భైంసాలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీ గోదాదేవి- రంగనాథుల కల్యాణోత్సవ వేడుకలు కమనీయంగా జరిగాయి. ఉదయం వేళలో ప్రారంభమైన కల్యాణోత్సవ వేడుకలు భక్తుల కోలాహలం మధ్య మధ్యాహ్నం వరకు వైభవోపేతంగా జరిగాయి. వేడుకలలో భాగంగా ఉత్సవమూర్తులను భాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో గేయాలు ఆలపిస్తూ, కోలాటాల వేస్తూ పాల్గొన్నారు. ఉత్సవ మూర్తులకు నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు నృత్యాలు చేస్తూ వేడుకకు వన్నెతెచ్చారు. ఉత్స వమూర్తులను వివాహవేడుకల నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాటు చేసిన వేదిక పైకి తీసుకు వచ్చిన అనంతరం నిర్మల్‌కు చెందిన ఇందుర్తి ఆచార్య కళ్యాణ్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద్‌కుమార్ శర్మ వేడుకలను సంప్రదాయబద్ధమైన రీతిలో శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తితో భగవంతుడిని మెప్పించి. మూడు గంటల పాటు కన్నుల పండువగా కొనసాగిన కల్యాణోత్సవ వేడుకలను తిలకించిన ఆశేషభక్త జనవాహిని పులకరించిపోయింది. గోవింద నామస్మరణ చేపడుతూ వేడుకల్లో పాల్గొన్నారు.

- **ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు**

గోదాదేవి-రంగనాథుల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో శ్రీ నయనం నృత్యకళా నిలయానికి చెందిన కళాకారుల బృందం చేపట్టిన నృత్య ప్రదర్శనలు వేడుకలకు వన్నె తెచ్చాయి. ఒక వైపు వేద పండితులు గోదారంగనాథుల వివాహ ఘట్టాలను నిర్వహిస్తుండగా మరోవైపు సంబంధిత ఘట్టాలకు అనుగుణమైన గేయాలకు చిన్నారులు చేపట్టిన నృత్యప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గోదా-రంగనాథులు, గోపికల వేషధారణతో చిన్నారులు వివాహ వేడుకలకు సంబంధించిన గేయాలకు పూలదండాలు మార్చుకుంటూ అలక వహించడం, బుజ్జగించడం లాంటి ఘటనలను కన్నులకు కట్టినట్లుగా చేపట్టిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. శ్రీ నయనం నృత్య కళా నిలయం డైరెక్టర్ డా.రంగు సౌమ్య సంపత్ నేతృత్వంలో చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్దులను చేశాయి.

- **ముగిసిన ధనుర్మాసవ్రత మహోత్సవాలు**

గత నెల 16న ప్రారంభమైన ధనుర్మాస వ్రత మహోత్సవాలు సోమవారం నిర్వహించిన గోదా-రంగనాథుల కల్యాణోత్సవ వేడుకలతో ముగిశాయి. ఇరువదితొమ్మిది రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని ఇక్కడి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రోజు దివ్య తిరుప్పావై పారయణాలు, ప్రవచన కార్యక్రమాలు జరిగాయి. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా చేపట్టిన సహస్ర దీపాలంకరణ సేవ, తిరుమంజనం, కూటరై ఉత్సవం, ఆధ్యాయస్నేతవాలు, ఉత్తర ద్వార దర్శనం, నమ్మళ్వార్ పరమపదోత్సవాలు కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇక సోమవారం నిర్వహించిన గోదారంగనాథుల కల్యాణోత్సవ వేడుకల్లో ఆలయ ప్రాంగణం భక్తులతో పూర్తిస్థాయిలో కిక్కిరిసిపోయింది.

అరకొర దిగుబడులతో
అధికమైన ధరలు


విక్రయిస్తున్న రేగు, జీడి పండ్లు

- అంతంత మాత్రంగానే రేగు, జీడి పండ్ల లభ్యత
- సంక్రాంతి వేడుకలపై ప్రతికూల పరిస్థితులు

భైంసా,జనవరి 13:మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆనందోత్సహాల మధ్య జరుపుకునే సంక్రాంతి పర్వ దిన వేడుకలపై ప్రతికూల పరిస్థితుల ప్రభావం కనిపిస్తోంది. వాతావరణ ప్రతికూలతలతో వ్యవసాయ దిగుబడులతో పాటు పండ్ల దిగుబడులు కూడా తగ్గిపోయాయి. ఈ క్రమంలో సంక్రాంతి వేడుకల పూజలకు వినియోగించేందుకు పండ్లు దిగుబడులు అరకొరగానే వస్తున్నాయి. వేడుకలలో భాగంగా చిన్నారులకు పోసే భోగి పళ్లలో, గొబ్బెమ్మ పూజ కార్యక్రమాల్లో రేగు, జీడి, జామ పండ్లతో పాటు చెరుకు ముక్కలు, శనగ కాయలు తదితర వాటిని ప్రధానంగా వినియోగిస్తారు. ప్రతికూల పరిస్థితుల మూలంగా రేగు, జీడి పండ్ల దిగుబడులు ఘననీయంగా తగ్గిపోయాయి.


విక్రయానికి తీసుకువచ్చిన చెరుకు గడలు

అక్కడక్కడ లభ్యమవుతున్న ఈ పండ్ల ధర ఆకాశన్నంటే స్థాయికి చేరుకుంది. చిన్నపాటి జర్దా డబ్బా రేగుపండ్లను రూ.25కు పోస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది. ఇక జీడి పండ్లు డబ్బా ఒక్కంటికి రూ.30 తీసుకుంటున్నారు. జామ పండ్లు కిలోకు రూ.60తో విక్రయిస్తున్నారు. దీర్ఘకాలిక పంటగానున్న చెరుకును ఇక్కడి ప్రాంతంలో ఒక్క రైతుకు కూడా సాగు చేయడం లేదు. దీంతో పొరుగునే ఉన్న మహారాష్ట్ర నుంచి ఇక్కడికి తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. ఒక్కో చెరుకు గడను రెండు ముక్కలుగా చేసి ఒక్కో ముక్కను రూ.25 నుంచి రూ.30 లకు విక్రయిస్తున్నారు. ప్రతికూల పరిస్థితులు సంక్రాంతి పర్వ దిన వేడుకలపై తీరని ప్రభావాన్ని చూపుతున్నాయి. ధరలు అధికంగానున్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయక తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు.

భారీగా 'కదిలి' వచ్చిన భక్తులు


బారులు తీరిన భక్తులు

దిలావర్‌పూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పురాతన క్షేత్రం శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి దర్శనం కోసం సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీ పాప హరేశ్వర స్వామిని దర్శించు కునేందుకు బారులు తీరారు. అభిషేక పూజలు చేశారు. సుమారు 110 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే పుష్యమాసం, ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి, భోగి, సోమవారం కలిసి వచ్చే అరుదైన రోజు కావడంతో భక్తులు భారీగా వచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నెయ్యి దీపాలను వెలిగించారు. శ్రీ మాతాన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకున్నారు. అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమార్చన చేశారు. 18 వృక్షాలతో కూడిన మహావట వృక్షానికి పూజలు, చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు నిర్మల్ పట్టణం, సారంగాపూర్ మండలం ప్యారమూర్‌కు చెందిన భక్తులు అన్న ప్రసాదం పెట్టారు.



సలహాసంఘం జాడేది?


నేరడిగొండ తహసీల్దార్ కార్యాలయం

- రేషన్ పంపిణీపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- పట్టించుకోని ఆహార సలహా సంఘం కమిటీ
- ఆందోళనలో లబ్ధిదారులు

నేరడిగొండ, జనవరి 13 (ఆంధ్ర జ్యోతి) : నేరడిగొండ, మండలంలో అర్హులైన వారికి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 16 రేషన్ షాపులను ఏర్పాటు చేసింది. అయితే ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఏర్పాటు చేయాల్సిన ఆహారసలహా సంఘం కమిటీని ఎన్నుకోవడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో ఇటు సలహాసంఘం లేక, అటు అధికారుల పర్యవేక్షణ కరువై నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. లబ్ధిదారులకు ప్రతినెల అందాల్సిన నిత్యవసర సరుకుల పంపిణీ సక్రమంగా జరుగుతుందా. లేదా. అనే విషయం పర్యవేక్షణతో పాటు సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేయాల్సిన ఆహారసలహా సంఘం అసలు కనిపించడం లేదు.

- **కమిటీ ఇలా...**

మండల స్థాయిలో ఎంపీపీ, జడ్పీటీసీ, తహసీల్దార్, విద్యావేత్త, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ఆయా పార్టీల నాయకులు, గ్రామస్థాయిలో అయితే సర్పంచ్, ఎంపీటీసీ, వీఆర్వో, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, డీలర్, గ్రామపెద్దలు సభ్యులుగా ఉంటారు. ఎక్కడైనా రేషన్‌డీలర్ అక్రమాలకు పాల్పడినా, లేక సరుకుల పంపిణీలో వినియెగదారులకు ఇబ్బందులు తలెత్తినా ఆహార సలహాసంఘం దృష్టికి తీసుకెళ్తే. చర్చించి తగు చర్యలు తీసుకుంటారు.

- **డీలర్ల ఇష్టారాజ్యం....**

గతంలో ఏర్పాటు చేసిన సలహా సంఘాలు సమస్యలను పరిష్కరించారు. కాని ఐదేళ్ల నుంచి మండలంలో ఆహార సలహాసంఘాలను ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఆయా రేషన్ షాపుల డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కార్డుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- మండలంలో 16 రేషన్ షాపులున్నాయి. ఈ షాపుల పరిధిలోని లబ్దిదారులకు ప్రతినెల బియ్యం, కిరోసిన్, కంది పప్పు, పామాయిల్ వంటి నిత్యవసర సరుకులు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ప్రతినెల 1 నుంచి 15 వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో షాపులు తెరచి ఉంచాలనే నిబంధన ఉన్నప్పటికీ డీలర్లు పాటించడం లేదు. ఈ విషయమై వినియోగదారులు డీలర్లను ప్రశ్నిస్తే వినియోగదారులపై డీలర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు లబ్దిదారులు వాపోతున్నారు.



- **ఆదేశాలు వస్తే ఏర్పాటు చేస్తాం.. తహసీల్దార్ నేరడిగొండ**

మండలంలో వాస్తవంగా ఆహారసలహా సంఘం కమిటీలు పనిచేయడం లేదు. గతంలో ఉండేవి. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఆన్‌లైన్ చేయడంతో వాటిని ఉన్నతాధికారులు ఏర్పాటు చేయలేదు. ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు వస్తే మళ్లీ ఏర్పాటు చేస్తాం.















జిల్లాకేంద్రంలోని బహిరంగ మార్కెట్లో రంగు ముగ్గులను కొనుగోలు చేస్తున్న మహిళలు

నేడే సంబరాల సంక్రాంతి

- వాకిళ్లలో అందమైన రంగవళ్లులు
- వాయినాలు ఇచ్చుకోనున్న మహిళలు
- ఇళ్లల్లో గౌరీ, విష్ణువులకు ప్రత్యేకపూజలు
- పల్లెల్లో హరిదాసు కీర్తనలు, సన్నాయి మోతలు, గంగిరెద్దుల విన్యాసాలు

సంక్రాంతి పర్వదినాన్ని.. పురస్కరించుకొని మంగళవారం జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఘనంగా వేడుకలు జరుపుకోనున్నారు. దీనిలో భాగంగా అన్నదాత ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఇళ్లకు చేరిన అనంతరం వచ్చే తొలి పండుగ సంక్రాంతి. మూడు రోజుల పాటు ముంగిళ్లల్లో రంగురంగుల ముగ్గులతో వాటి మధ్య గొబ్బెమ్మలు పెట్టి శోభాయమానంగా అలంకరించి చిన్నలు, పెద్దలు, మహిళలు, యువతులు, యువకులు ఇంటిల్లి పాది పండుగను ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఉదయం వాకిళ్లలో మహిళలు, యువతుల వేసిన రంగు రంగుల ముగ్గులతో జిల్లాలో కోలాహలం నెలకొంది.

వివరాలు 7వ పేజీలో...

● పంట పొలాల్లో పురుగు మందులు పిచికారి చేస్తున్న రైతులు



బయో.. మాఫియా!


- జిల్లాలో అడ్డగోలుగా సాగుతున్న నకిలీ పురుగు మందుల వ్యాపారం
- మాయ మాటలు చెప్పి రైతులకు అంటగడుతున్న వ్యాపారులు
- కొరవడిన పర్యవేక్షణ.. అధికారుల సలహాలు, సూచనలు
- మామూలుగానే తీసుకుంటున్న వ్యవసాయ శాఖ
- జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో లక్షా 50వేల ఎకరాలలో సాగవుతున్న వివిధ రకాల పంటలు

ఆదిలాబాద్ జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బయో మం దుల (పిచికారి మందులు) వ్యాపారం విచ్చలవిడిగా సాగు తోంది. జిల్లా కేంద్రంలో మకాం వేసిన బయో మందుల వ్యాపా రులు అడ్డగోలుగా అమ్మేస్తూ.. అందిన కాడికి దండుకుంటున్నారు. పంటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయని నమ్మబలుకుతూ అమాయక రైతులకు అంటగడుతున్నారు. గతంలో నకిలీ బయో పురుగు మందులతో శనగ, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినా.. అధికారులు ఈ అడ్డగోలు వ్యాపారానికిని అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. పంటల సాగులో అన్నదాతలకు అండగా నిలవాల్సిన అధికారులే అడ్రస్ లేకుండా పోవడంతో వ్యాపారులే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కొన్ని చట్టపరమైన లొసగులను ఆధారంగా చేసుకుని ఈ దందాను కొనసాగిస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తూనే ఉన్నారు. అసలు పురుగు మందుల వాడకంపై కనీస అవగాహన లేని అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో ముఖ్యంగా పత్తి, శనగ, కంది, జొన్న, మొక్కజొన్న పంటలను ఎక్కువగా పండిస్తారు, రబీ సీజన్ ప్రారంభం కావడంతో శనగ పంటలో పచ్చపురుగు, ఉధృతి పెరగడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సీజన్‌లో 1,50,000 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు కాగా.. 80 వేల ఎకరాలకు పైగా శనగ పంట సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నకిలీ బయో మందులతో రైతులు నష్టపోతున్నా.. పరిహారం ఇప్పించేందుకు అధికారులు ముందుకు రావడంలేదని రైతులు పేర్కొంటున్నారు. కొన్ని మండలాల్లో వ్యాపారులతో కుమ్మకైన కొంతమంది అధికారులు.. సెటిల్మెంట్‌లు చేస్తూ.. ఎంతో కొంత రైతులకు ముట్టచెబుతున్నారు. జిల్లాలో ఏటా కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నా.. అక్రమ వ్యాపారాన్ని ఆపలేకపోతున్నారు. జిల్లాలో నకిలీ బయో పురుగు మందుల వ్యాపార వ్యవహారం వెలుగు చూస్తున్నా.. వ్యవసాయ శాఖ మామూలుగా తీసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వారు చెప్పిందే లెక్క.. ఇచ్చిందే మందు!!

జిల్లాలో వ్యాపారులు ఇచ్చిందే మందు.. చెప్పిందే లెక్క అన్నట్లుగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించకుండానే ఖరీదైన పురుగు మందులను అంటగడుతూ దండుకుంటున్నారు. నాణ్యత పనితనంతో సంబంధం లేకుండానే ఎక్కువ లాభాలు వచ్చే పురుగు మందులను అమ్మేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కొన్ని సందర్భాల్లో అయితే.. కాలం చెల్లిన పురుగు మందులను రైతులకు అమ్మేస్తూ చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జైనథ్, బేల, ఆదిలాబాద్, రూరల్ మండలాల్లో విచ్చలవిడిగా బయో మందుల వ్యాపారం కొనసాగుతోంది. గతంలో బేల మండల కేంద్రంలో ఓ వ్యాపారి బయో మందులను తయారు చేస్తూ పట్టుబడిన దాఖలాలు ఉన్నాయి ఇంట్లోనే వివిధ రకాల కషాయాలు రంగులను కలిపి పురుగు మందులను తయారు చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు నామమాత్రంగానే చర్యలు తీసుకుని వది లేశారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా బయో మందుల వ్యాపారులు ఓ మాఫియాగా ఏర్పడి అధికారులకు ఎంతో కొంత ముట్టచెప్పడంతో మౌనంగానే ఉండిపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అష్టకష్టాలు పడి పంటలను

(తరువాయి 6వ పేజీలో...)



బయో మందులు కొనుగోలు చేయవద్దని చెబుతున్నాం

: శ్రీధర్ స్వామి, వ్యవసాయ శాఖ అధికారి, ఆదిలాబాద్

రైతులు బయో మందులు కొనుగోలు చేయవద్దని చెబుతున్నాం. అయినా కొంత మంది రైతులు ఆశపడి అధిక దిగుబడులు వస్తాయని కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారు. ఆ మందులతో ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటికీ గ్రామాల్లో పలుమార్లు అవగాహన కల్పించి సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. కోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ బయో మందులను విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. బయో మందులతో పంటలు నష్టపోతే రైతులు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి.



ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

కన్నులపండువగా గోదారంగనాథుల కల్యాణం

బోథ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచలాపూర్ వేంకటేశ్వర ఆలయంలో సోమవారం గోదాదేవి రంగనాథుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. మండలంలోని పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ముందుగా ఉత్సావ విగ్రహాలను ఆలయం నుంచి కల్యాణ వేదికకు భక్తులు తీసుకురావడం జరిగింది. అనంతరం వేద పండితులు పండరి శర్మ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణానికి మహిళా భక్తులతో పాటు పలు గ్రామాల నుండి భారీ సంఖ్యలో దాదాపు వెయ్యి మంది వరకు తరలివచ్చారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూ వివాదాన్ని పరిష్కరించాలి

● తహసీల్దార్‌ని ఆదేశించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కగూడ సమీపంలోని (పీపీ ల్యాండ్) సర్వే నెం.79లోని ఒక ఎకరం 11 గుంటల వివాదస్పద భూమిలోని, సమస్యను వెంటనే పరిష్కరించాలని ఉట్నూర్ తహసీల్దార్‌ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశించారు. సోమవారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లంబాడి జేఏసీ ఆధ్వర్యంలో, లంబాడి గిరిజన నాయకులు పెద్దసంఖ్యలో కలవగా, సర్వే నెంబర్ 79 లో బంజారా భవనం కోసం ఎకరం స్థలం 2003లో కేటాయించగా, ఆ స్థలాన్ని కొంత మంది వ్యక్తులు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేయగా, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిందిగా తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇరువర్గాలకు న్యాయం జరిగే విధంగా సమస్యను సామరస్య పూర్వకంగా, ఆమోదయోగంగా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌ను కోరారు. త్వరలోనే సమస్యను పరిష్కారం చేస్తామని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఐటీడీఏ పీవోతో చర్చించి జీసీసీ పెట్రోల్ బంకు పక్కన సంత్ సేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణం కోసం నాలుగు గుంటల స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని, అన్ని కులాల అభివృద్ధి కోసం, పార్టీలకు అతీతంగా,కుల, మతాలకు అతీతంగా ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో లంబాడి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ నాయక్ అడ్వకేట్, జాదవ్ రెడ్డి నాయక్ జిల్లా అధ్యక్షుడు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జాదవ్ శ్రీరాం, రాథోడ్ నారాయణ, బానోత్ రామారావు, నేతావత్ రాందాస్ నాయక్, రాథోడ్ శేష రావు, ఆడె సురేష్, జైవంతు రావు ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్, పవర్ గంగారం నాయక్, పవర్ దేవిదాస్, రాథోడ్ రామారావు నాయక్, ఆడె గడ్డం ప్రకాష్ రాథోడ్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.



● ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కలిసిన లంబాడా జేఏసీ నాయకులు

● యంగ్ ఇండియా పోస్టర్ల విడుదల

ఉట్నూర్: దేశవ్యాప్తంగా యువతీ, యువతను మేలుకొల్పి, పేదల పక్షాన ప్రశ్నించే గొంతుకలను తయారు చేయడమే యంగ్ ఇండియా కే బోల్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5కి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న యువతను పేద ప్రజల పక్షాన పోరాటంలో చేయడంలో భాగంగా యంగ్ ఇండియా కే సీజన్-5ను ప్రారంభించడం జరిగిందని అన్నారు. సమస్యల పరిష్కారంలో యువత ముందు వరుసలో ఉండాలనే మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఇండియా కే బోల్ కార్యక్రమంలో పెద్దఎత్తున యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకునే యువతీ యువకులకు గూగుల్‌లో లింక్ అందుబాటులో ఉందని, అందులో వివరాలను పొందుపర్చి భాగస్వాములు కావచ్చన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతుల ప్రధానం ఉంటుందని తెలిపారు. ఇందులో గెలిచిన వారికి ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీ అజ్మత్ ఖాన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అరికిళ్ల పరమేశ్వర్, ఎన్ఎస్‌యూఐ స్టేట్ సెక్రటరీ సోహేల్ షా, నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడు హర్షద్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు తిగుట్ల రాజ్ కుమార్, తదితలరులు పాల్గొన్నారు.



సాలెవాడ నుంచి ధర్మగూడకు పాదయాత్రగా వెళ్తున్న మెస్రం గిరిజనులు

సంప్రదాయ పూజల కోసం పాదయాత్ర

ఉట్నూర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఆదివాసీ గిరిజనులు భావితరాలకు అందించేలా సంస్కృతీ, సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. ఈనెల 10న కెస్లాపూర్ నుంచి నాగోబా మహా జాతర ప్రారంభానికి కావాల్సిన గంగాజలం కోసం మెస్రం గిరిజనులు పాదయాత్ర ప్రారంభించారు. నాగోబా అభిషేకం కోసం కావాల్సిన పవిత్ర గంగాజలం సేకరణ కోసం తెల్లని దుస్తులు ధరించి పాదయాత్ర ప్రారంభించారు. ఆదివారం సాలెవాడా చేరుకున్నారు. సోమవారం మెస్రం గిరిజనులు ఏర్పాటు చేసిన స్థలానికి చేరుకొని పవిత్ర జలాలు తెచ్చే కలశాన్ని మూడు కట్టెలపై భద్రపరిచి ఉంచారు. సాలెవాడలోని మెస్రం గిరిజనులు పూజలు నిర్వహించిన అనంతరం గంగాజలం తెచ్చే కలశంతో మెస్రం గిరిజనుల పాదయాత్ర మండలంలోని ధర్మగూడా వైపు కొనసాగింది. ధర్మగూడలో బస చేసి మంగళవారం పూజల అనంతరం నాగోబాగూడకు, 15న ఉమ్మడి జిల్లాలోని ఉడుంపూర్‌కు, 16న మల్లాపూర్‌కు, 17న జన్నారం మండలం కలమడుగు వద్ద ఉన్న గోదావరి రేవుకు చేరుకొని హస్తినమడుగులో స్నానాలు చేసిన అనంతరం పవిత్ర జలాలు సేకరించిన అనంతరం నుంచి తిరుగు ప్రయాణం పాదయాత్ర ద్వారా ప్రారంభిస్తామని మెస్రం కోసే రావు, బాధిరావు తెలిపారు.

చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి

నార్నూర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులతోపాటు క్రీడలపై ఆదివాసీ విద్యార్థులు దృష్టి సారించాలని తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందుర్ దాదిరావు అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని దాబా(బి) గ్రామపంచాయతీ పరిధిలో పొనూర్ గ్రామంలో కొమురం భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలకు ముఖ్యఅతిథిగా ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పెందుర్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గొప్ప స్థాయి నిలబడడానికి చదువుతోపాటు మంచి సంస్కారాలు చాలా అవసరమని పేర్కొన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాదు బాయి, గ్రామ పటేల్ శంభు, జాద వికాస్, గంగారాం, సుదర్శన్, కైలాష్, రమేష్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తారురోడ్డుకు మరమ్మతులు చేపట్టిన నాయకులు

తారురోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

● సుంకిడి వద్ద వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డును బాగు చేసిన బీఆర్ఎస్ నాయకులు

సిరికొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్డుకు సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఇచ్చోడ నుంచి సిరికొండకు వెళ్లే రోడ్డు మార్గంలో సుంకిడి గ్రామ సమీపంలో కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడంతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించడంతో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే నాగోబా జాతర త్వరలోనే ప్రారంభమవుతుండడంతో ఇచ్చోడ మండలం మీదుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డుకు మరమ్మతులు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. త్వరలోనే ఇచ్చోడ నుంచి సిరికొండ వరకు డబుల్ రోడ్డును మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జాదవ్ రోహిదాస్, ఎండీ ఎక్బాల్, ఈసా, గుగ్గిళ్ల స్వామి, సుంకిడి గ్రామ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు ఉద్యమిస్తాం

- మాజీ మంత్రి జోగు రామన్న
- గాలిపటాలతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ఆదిలాబాద్ రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్నికల సమయంలో రైతులతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు ప్రభుత్వంపై ఉద్యమిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రైతు భరోసా అమలు చేయడంతో హామీలను నెరవేర్చాలని సోమవారం బస్టాండ్ సమీపంలో రహదారిపై ధర్నా నిర్వహించారు. స్థానిక ఆర్అండ్ నుంచి ర్యాలీగా వచ్చారు. రోడ్డుపై దాదాపు అర గంటకు పైగా బైఠాయించారు. దీంతో పోలీసులు వారిని ధర్నాను విరామించాలని సూచించారు. జోగు రామన్నతోపాటు నాయకులను పోలీసులు బలవంతంగా పక్కకు తప్పించారు. దీంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చి విస్మరించారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ పంటలకు పెట్టుబడి సాయం చేస్తే మూడవ పంటకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతు భరోసా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ కూడా పూర్తి చేయలేదన్నారు. అంతేకాకుండా ఆదిలాబాద్ జిల్లాలోని లక్షా 20 రైతులు రూ.రెండు లక్షలలోపు రుణాలు తీసుకున్నారన్నారు. అందులో 60 వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని, ఇందులో కూడా 40 వేల మందికి ఖాతాలు రెన్యువల్ కాగా.. మిగత 20 వేల ఖాతాలు రెన్యువల్ కాలేదన్నారు. అదేవిధంగా కౌలు సాయం, కల్యాణ లక్ష్మీ, పథకంలో బంగారం ఏమైందని ప్రశ్నించారు. 420 హామీలను అమలు చేస్తామని చెప్పి సీఎం ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. రైతు భరోసా ఇచ్చే వరకు గ్రామాల్లో వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీయాలని అన్నారు. రైతు భరోసా అమలు చేయడంతో హామీలను నెరవేర్చాలని సోమవారం బస్టాండ్ సమీపంలో రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేష్, పవన్ నాయక్, సయ్యద్ సాజిదొద్దీన్, జగదీష్, కుమ్ర రాజు, స్వరూపరాణి, మమత, తదితరులు పాల్గొన్నారు.





రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు
(ఇన్‌సెట్‌లో మాజీ మంత్రి జోగు రామన్నను తీసుకెళ్తున్న పోలీసులు)

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
ఆదిలాబాద్ - 93983 85917
ఇచ్చోడ - 85000 38312
అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451